నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# మెదక్

సోమవారం 30 అక్టోబర్ 2023
MONDAY, OCTOBER 30, 2023

MEDAK

పేజీలు : 12
PAGES




నారాయణఖేడ్ పట్టణం వ్యూ



## నిధుల వరదతో..
# వెనుకబాటు పరారు

**రూ.2,948 కోట్లతో నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి**

- తొమ్మిదేండ్లలో అన్నిరంగాల్లో అద్భుత పురోగతి
- సింహభాగం నిధులు సాగునీటి కల్పనకు కేటాయింపు
- తరతరాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం
- మారిన రూపురేఖలు.. దశాదిశ చూపిన సీఎం కేసీఆర్
- నేడు నారాయణఖేడ్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ

-లోపలి పేజీల్లో..

- సభకు ఏర్పాట్లు పూర్తి.. 450మంది పోలీసులతో బందోబస్తు
- 50 వేల మంది ప్రజలు హాజరయ్యే అవకాశం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ రూపేశ్
- గులాబీమయంగా మారిన నారాయణఖేడ్



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**ఒకప్పుడు నారాయణఖేడ్ అంటే** వెనుకబాటు, వలసలు. ఇక్కడికి బదిలీ అంటేనే పనిష్మెంట్.. వివక్షగా భావించేవారు. కానీ, గడిచిన తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి వాటన్నింటినీ తుడిచిపెట్టింది. సమైక్య రాష్ట్రంలో నారాయణఖేడ్ నియోజకవర్గంపై వెనుకబాటు ముద్ర వేయడం ఒకటైతే, శాఖాపరమైన చర్యల్లో భాగంగా ఈ నియోజకవర్గంలోని కంగ్టి, మనూరు మండలాలకు బదిలీ చేసి ఈ ప్రాంతాన్ని పనిష్మెంట్ జోన్‌గా మార్చి ఇక్కడ అభివృద్ధికి అడ్డుకట్ట వేశారన్నది నిజం. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో ఇక్కడి పరిస్థితులు పూర్తిగా మారాయి. నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో రూ.2,948 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో సింహభాగం సాగునీటి కల్పనకు, అటు తర్వాత తాగునీరు, రవాణా సదుపాయాల కల్పనకు కేటాయించింది. ఈ ప్రాంత ఆవశ్యకత, ప్రజల అవసరాలను గుర్తెరిగి నియోజకవర్గ దశాదిశ మార్చిన సీఎం కేసీఆర్ నేడు నారాయణఖేడ్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

- నారాయణఖేడ్, అక్టోబర్ 29



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి

## నర్సాపూర్‌లో మరోసారి
# గులాబీజెండా ఎగరాలి

- మనందరిదీ బీఆర్‌ఎస్ కుటుంబం
- సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని మెదక్ ఎంపీ చేసే బాధ్యత నాది
- రైతుబంధు నిలిపేయాలని ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు
- కాంగ్రెస్ వస్తే రైతన్నలు అణగదొక్కడం ఖాయం
- నర్సాపూర్ ఎన్నికల శంఖారావం సభలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు

మధ్యపేజీల్లో..

నర్సాపూర్ నియోజకవర్గంలో మరోసారి గులాబీజెండా ఎగరాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఆదివారం నర్సాపూర్‌లోని చాముండేశ్వరి గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ఎన్నికల శంఖారావాన్ని పూరించి మాట్లాడుతూ.. నర్సాపూర్ పార్టీ కార్యకర్తలు టికెట్ విషయంలో గొప్ప స్ఫూర్తిని చాటారని, అధిష్ఠానం సునీతాలక్ష్మారెడ్డికి టికెట్ ప్రకటించగా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సునీతాలక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిపై బాధ్యత పెట్టారన్నారు. మెదక్ ఎంపీగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని గెలిపించే బాధ్యత తాను తీసుకుంటున్నానని హామీ ఇచ్చారు. మనందరిదీ బీఆర్‌ఎస్ కుటుంబమని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. - నర్సాపూర్/శివ్వంపేట, అక్టోబర్ 29



బీఆర్‌ఎస్ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి

## మన ఇంటి ఆడబిడ్డను
# మరోసారి ఆశీర్వదించండి

- ఇక్కడ రెడ్డి కావచ్చు.. కరీంనగర్‌లో మాకు పద్మ ఆడబిడ్డ
- ఈ అభివృద్ధి కొనసాగాలంటే పద్మాదేవేందర్‌రెడ్డిని దీవించండి
- మెదక్‌లో మున్నూరుకాపు ఓట్లతో భారీ మెజార్టీ ఖాయం
- మెదక్‌లో మున్నూరుకాపు కృతజ్ఞత సభలో మంత్రి గంగుల కమలాకర్
- మున్నూరుకాపుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

8

**మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాఇంటి ఆడబిడ్డ..** ఆమెను మరోసారి ఆశీర్వదించండి.. అని మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా మున్నూరు కాపు కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుతంత్రాలు చేసినా మెదక్ ఎమ్మెల్యేగా పద్మాదేవేందర్‌రెడ్డి మూడోసారి గెలుపొందడం ఖాయమన్నారు. కుల సంఘాల భవనాలకు నిధులు అడిగితే అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వెకిలిగా నవ్వుతూ అవమానించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ మున్నూరు కాపులను గుర్తించి, వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, మున్నూరు కాపు కులస్తులంతా బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మున్నూరుకాపులు మాట ఇస్తే తప్పరని, ఈ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. - మెదక్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ)



మెదక్‌లో మున్నూరు కాపు కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్